


[illegible]హంతోల్చుకుని కాఫీ త్రాగుదామని అయ్యారు దేవాలయానికి బయల్దేరాను. అప్పటికి తొమ్మిదిగంటలకు పైగా అయివుంటుంది. అంతకుముందు లేస్తే నాకు జబ్బు చేస్తుంది.

"లజ్" చేరుకునేసరికి పెద్ద కోలాహలంగా వుంది. పేపర్లు అమ్మేచోట జనం తెంగమొహాలు వేసుకుని గుమిగూడి వున్నారు. గూడకట్లే ఎక్కువ కనిపించాయి. కొంతమంది ఏడుస్తున్నారు. అందరూ ఏదో పెద్ద చెడువార్తవిన్నట్లు దిగజారిపోవడం మొదలెట్టారు.

'ఏమిటో ఈ గందరగోళం అని కొట్టుదగ్గరకు వెళ్లి, ఎల్లాగో జనంలోంచి త్రోసుకుని చూస్తే, అక్కడ ఓపది పదిహేనుమంది నేలమీద పడిపోయివున్నారు. శ్వాస ఆడుతోందో లేదో అనుమానంగా వుంది.

[illegible] ర్లను వొణుకుతున్న చేతుల్తో పీకేస్తున్నాడు. నాకేమీ బోధపడలే దీదృశ్యం. ఓఅరవ భాయీని పిలిచి అడిగితే, వా డేదో చెప్పదామనుకున్నాడు. కాని, నోట్లోంచి మాట పెగలటంలేదు. ముక్కుకీ, నోటికీ జేబురుమాలను కుక్కి పోస్టర్లకేసి వేలు చూపించాడు. "త్రిఫికాస్కిర్రిమ్సు" అనే చిత్రంలో తన మిత్రులతో గూడి ఉద్యానవనంలో విందారగిస్తున్న సందర్భంలో భీకరమైన అడవిమృగం చెట్టుచాటునుంచి సౌజ్ఞ చేస్తున్నప్పుడు 'కాస్టెలో' చేసినపిరికి చేష్టలు జ్ఞాపకానికి వచ్చాయి. భయ విషాదాలకు తీవ్రంగా ఆహుతైపోవడంవలన

[illegible] తినడానికి ఉపయోగిస్తున్న బాకుతో పొడుచుకోడానికి సిద్ధపడతాడు.

అంతవరకూ ఈ కోలాహలంలో పోస్టర్ చూద్దామని నాకు తట్టలేదు. పోస్టర్ చూశాక, ఈ సంక్షోభానికి కారణం తెలిసింది. ఆ రోజు పత్రికల్లో సాంబారుకు రేపటినుంచీ రేషనింగ్ పెట్టారని ప్రకటించబడింది. ఎన్నడూ ఒకకాలం "హెడ్ లైన్" కుమించి "ఫీచర్" చెయ్యని "హిందూ" పత్రి కానాడు తాటికాయంత అక్షరాలతో మొదటిపేజీలో "స్టీమర్" ఇచ్చింది "సాంబారుకు రేషన్: మనిషికి 3 గరిటెలు మాత్రమే" అనిగుండెబ్రద్దలయ్యేటట్లు ప్రకటించింది.

నేను పిలిచిన కుర్రాడిచికొంచం గట్టి ప్రాణమనే చెప్పాలి. ఈ వార్త అరవ కమ్యూనిటీలో ఎంత సంక్షోభాన్ని పుట్టిం

చిందో చెప్పనలవికాదు. ఇంగ్లీషు తెలిసిన అరవసోదరులు పోస్టర్లు చూసీ చూడ్డంతోనే స్పృహతప్పి పడిపోయారు. దుర్బలహృదయులు అసువులను సైతం బాశారని వదంతిగా వుంది.

వెనక నాస్నేహితుడొకడు ఇద్దరు దెబ్బలాడుకొంటూంటే చూడటం తనకు "సరదా" అని, ఆదెబ్బలాట భార్యాభర్తల మధ్య అయితే, "మిక్కుట" మని వ్రాసాడు. అతనికి పత్రికావిలేకరికి ఉండవలసిన ముఖ్యలక్షణాల్లో ఒక్కటివుంది. కాని అతను ఎక్సైజు సబ్ ఇనస్పెక్టరుగా పోయాడని విచారిస్తున్నాను. నేనూ ఒకపత్రికా విలేకరిని. పత్రికావిలేకరికి దెబ్బలాటలకంటే చావులంటే పరమప్రీతి. లేచినవేళా విశేషమేమిటోగాని, నాముందు ప్రత్యక్షమయిన పరిస్థితి చూస్తే కడుపునిండిపోయింది. నాసత్తా ఇవాళ చూపించాలనుకొని, విశేషాలు "గేదర్" చెయ్యడం మొదలుపెట్టాను.

స్నానులేనిదే బండినడవదు కాబట్టి ఒకకప్పు కాఫీత్రాగి, సిగరెట్టుఅంటించి, విచారగ్రస్తమైన మొహంపెట్టి వార్తాసంగ్రహణకై బయల్దేరాను. పత్రికావిలేకరి సమయానుకూలంగా ప్రవర్తించాలికాని వెక్కిరింపు మొహంతో బయల్దేరితే వీపుమీద బడితెలు విరుగుతాయి. ఎవడిదగ్గిర వాడి బాజా వాయిస్తేనేగాని "స్కూప్"లు దొరకవు.

ఒక్కమైలాపూరులోనే ఏ వందలపైగా "క్యాజువాల్టీస్" జరిగాయని విశ్వసనీయంగా తెలిసింది. నేను లజ్ చేరేసరికి సుమారు 500 మందిని ఆస్పత్రికి చేర్చారట. నాకళ్లముందు పదిహేనుమంది స్పృహతప్పి పడిపోయివున్నారు. తర్వాత కాఫీ త్రాగివచ్చేటప్పటికి ఇంకో పదిమంది పడివున్నారు.

పోస్టర్లు ఎందుకు తీసివేస్తున్నావని అడిగితే, కొట్టువాడు మండిపడ్డాడు. నేను పత్రికా విలేకరినని చెప్పేంతర్వాత శాంతించి పోలీసులు తీసివేయమన్నారన్నాడు.

నీ కొట్టుదగ్గిర ఏంజరిగిందో చెప్పమంటే, నాపిటుల నుడివెను. "హిందూ పేపరు ఇమ్మంటూ ఒకాయన వచ్చాడు. నేను పత్రిక తీసి ఇయ్యబోయేటప్పటికి ఆయన మాయమయ్యాడు. ఇదేమిట్రా అనుకున్నాను. ఇంతలో ఇంకొకాయన వచ్చాడు. ఆయనకూడా పత్రిక ఇమ్మన్నాడు. నేను పత్రికతీసేసరికి ఆయనకూడా అదృశ్యుడయ్యాడు. నాకాశ్చర్యమేసి క్రిందికి చూసేను, ఏంచెప్పను? వాళ్లు కేవలం అదృశ్యులైపోలేదు కాని, స్పృహతప్పి క్రిందపడివున్నారు. నాకు భయమేసి దారినపోయే కొంతమంది పెద్ద మనుష్యులను రమ్మని పిలిచాను. నేను వారికి జరిగిందంతా చెపుతూ, నేనక్కడ కూర్చున్నానని నేను కూర్చున్నస్థలం వైపు చూపించేసరికి, వాళ్లలో కొంతమంది "హా" అని ఆక్రోశించి కింద పడిపోయారు. కొంతమంది ఏడుపు లంకించుకున్నారు. ఇంకో ఇద్దరు కౌగలించుకుని ఆరున్నొక్కరాగం (క్లాసికల్ స్టైల్ లో) ఆలపించసాగారు. కొద్దిసేపట్లోనే ఒక గుట్ట తయారయింది. చుట్టూ వేదఘోష. కొద్దిసేపటికి పోలీసువాళ్లు కారువచ్చి, నా దుకాణం దగ్గిర, తక్కిన దుకాణాలదగ్గిర పడివున్న మందభాగ్యులను హాస్పిటలుకు మోసుకుపోయింది. ప్రతికొట్టుదగ్గిరా గుట్టలు గుట్టలుగా జనం కొకుల్లారాలిపోయారని చెప్తున్నారు ఇంతకీ దానికి కారణం ఏమిటో నాకింతవరకు బోధపడలేదు. 'ఏచెప్పేవాళ్లే కాని చెప్పేవాళ్లు కనిపించలేదు.'

"నేను చెప్పనా ?" అన్నాను.

"చెప్పండి, స్వామి" అని ఆవేదనతో అడిగాడు.

ఆఁ ఏమీ లేదు. రేపటినుంచి మనిషికి 3 గరిటల సాంబారుమాత్రమే ఇస్తారని పేపర్లో ప్రకటించారు. సాంబారుకు రేషను పెడ్తున్నారు. ఈవార్త పోస్టర్లలో చదవడం వల్ల వీరికీఆపద సంభవించిందని" చెప్పాను.

ఆపళంగా ఆ కొట్టువాడు "హా" యని కొండకూలిన ట్లిలపై కొరిగెను.

తర్వాత విచారించాను. ఈ వార్త ఈ అభాగ్యుడికి చెప్పకుండా వుండవలసిందనుకున్నాను. పర్వతమంత ఈ మనిషిని కూడా ఈవార్త క్షైమా చేస్తుందనుకోలేదు.

అల్లంత దూరంలో ఒక ముసలాయన "హిందూ" పత్రిక పదేపదే చదువుతూ కుళ్లి కుళ్లి ఏడుస్తున్నాడు.

మొండిఘటాలు "ఇవాళకేకదా" అని హోటళ్లలోపడి ఆపళంగా సాంబారు పట్టెయ్యడం మొదలెట్టారు. సగటున ఒక్కొక్కడు రెండు ఇడ్లీలకు అరడజను ప్లేటులసాంబారుచొప్పున జుర్రేస్తున్నారు. సాంబారుకు గిరాకీహెచ్చింది. హోటలు యజమానులు సాంబారుకుకూడా వేరేధర పెట్టారు. కప్పు అణాన్నర చేశారు- "సింగిల్" కాఫీ, "సింగిల్" టీ అమ్మే హోటళ్లలోకూడా. కాని డిమాండు విపరీతంగా హెచ్చిపోవడంవలన 11 గంటలకల్లా కప్పుధర అర్ధరూపాయవరకు పెరిగిపోయింది. 12 గంటలకు "సాంబారు లేదు" అని బోర్డులు తగిలించారు. కాని చీకటి బజారులో కప్పురూపాయకు లభిస్తోంది.

బట్టలు మార్చుకుని బయల్దేరుదామని ఇంటికి వచ్చి నాస్నేహితులకు ఈవార్త వినిపించాను. అందులో ఒకడు జాస్తై పోయాడు. ఇంకొకడికి చలిజ్వరం వచ్చేసింది. అందులో ఆశ్చర్యం ఏమీలేదు. తమిళులు సాంబారంటే ఎంత పడిచస్తారో ఆంధ్రులు గోంగూరపచ్చడంటే అంత మొహంవాచి పోతారని ఒక ప్రతీతి గలదు. హైదరాబాదు ("హైదరాబాద" అని అనడం కాశేశ్వరరావుగారు మానాలి) తెలుగువాళ్లు మద్రాసు ఆంధ్రుల్ని "గోంగూర గా"ళ్లంటారు. కాని, గోంగూర, సాంబారులలో ఏది కావాలి" అంటే మావాళ్లిద్దరూ సాంబారే కావాలంటారు. గోంగూరకూ, సాంబారుకూ ఒకటే వ్యత్యాసం వుంది. సాంబారు అంటువ్యాధిలాంటిది, గోంగూర కాదు. కాని ఒకసారి మరిగారంటే, రేషనుఅన్నంల్లో ఎక్కువ భాగాన్ని దానితోటే కొట్టేస్తారు. కొందరు అరవవాళ్లు, మజ్జిగా అన్నంలో మయాన్ని 2 అంగుళాల వ్యాసార్ధంతో ఒక వలయాకారఖాళీస్థలం ఏర్పరచి దాంట్లో మళ్లీ సాంబారు పోయించుకుని, మజ్జిగ అన్నాన్ని కొంచెంకొంచెం సాంబారు వలయంలోకి త్రోసుకుంటూ భుజిస్తారు. మనవాళ్లు గోంగూర పచ్చడి నంచుకున్నట్లు. నమ్మతారో లేదోకాని, ఒకాయన హోటలుకు ఒక గ్లాసు తెచ్చుకొని, అందులో సాంబారు పోయించుకుని భోజనం అంతా అయిన తర్వాత, సాంబారుదాహం పుచ్చుకొనేవాడు.


# శ్రీమద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు

పంచమ ముద్రణము : వెల రూ 4-0-0

(ప్యాకింగు, పోస్టేజి రూ 0-9-0)

ఆంధ్రగ్రంథమాల.



కాశ్మీర్

అన్నిదగ్గులకు అమోఘమైనది

గిరిజా & కో; రాజమండ్రి

బట్టలుమార్చుకుని తిరిగి లజ్ చేరుకోగానే సరికి ప్రతీది స్తంభించిపోయింది. ఎక్కడ బస్సులక్కడే ఉన్నాయి. ఎక్కడ ట్రాము లక్కడే వున్నాయి. కండక్టర్లు సమ్మె చేశారు. లజ్ లో ట్రాముకు ఇనస్పెక్టరు నడుపుదామనుకున్నాడు. కాని అదికూడా సమ్మెచేసి, కదలడానికి నిరాకరించింది.

లజ్ నుంచి ఎల్లా వెళ్లాలో సరిగ్గాజ్ఞాపకం లేదు. మధ్యాహ్నం 2 గంటలకు పోలీసు ఇనస్పెక్టరు జనరల్ ఒక ఇంటర్వ్యూలో మద్రాసు నగరంలో సాంబారు రేషనింగు వార్తవినడంవల్ల స్పృహతప్పి పడిపోయిన వారి సంఖ్య 10,000 వరకు పెరిగిందని చెప్పారు. పత్రికలమ్మకం వెంటనే నిషేధించడంవలన పరిస్థితి కొంత అదుపులోకి వచ్చిందన్నారు. ఈవార్తవల్ల చావులు సంభవించాయన్న వదంతి నిరాధారమైనదని ఆయన ఖండించారు. హాస్పిటలుకు చేర్చబడినవారిలో కొంతమంది స్వర్గస్థులైనారటకదా అని ప్రశ్నించగా, "అవన్నీ డయేరియా కేసులని" ఆయన అన్నారు.

ఆహారశాఖా కార్యదర్శి మా కొక "స్కూప్" ప్రసాదించాడు. ఆంధ్రదేశంలో సాంబారుఉత్పత్తిని, అమ్మకాన్ని నిషేధించడానికి ప్రభుత్వం నిశ్చయించిందని. సాంబారు (addicts) కు అలవాటు పడినవారికి మాత్రం కలెక్టరు పెర్మిట్లు ఇస్తాడని, ఆయన చెప్పారు. సాంబారు బ్లాకు మార్కెటు చేసినవారిపై ప్రభుత్వం "తీవ్రమైనచర్య" తీసుకుంటుందని, దీనికై ప్రభుత్వం త్వరలోనే ఒక శాసనాన్ని తయారు చేస్తుందని కూడా ఆయన తెలియపరచారు. ఒక విలేకరిప్రశ్నకు, సమాధానం చెబుతూ బహుశా మరణదండన విధించుటకు ప్రభుత్వం ఆలోచిస్తోందని ఆయన చెప్పారు.

సాయంకాలం పత్రికలలో తమిళనాడులో వేలాదిప్రజలు స్పృహతప్పిపడిపోయారని, సుమారు 1,000 మందికి పైగా ప్రమాద పరిస్థితిలో ఉన్నారని ప్రకటించబడింది. "మెయిలు"లో మాత్రం చాలా చోట్ల చావులు సంభవించాయని ప్రకటించబడింది. ఈ వార్తవల్ల "ఎఫెక్టు" అయిన వారిసంఖ్య 10 లక్షలని ఇంతవరకూ అంచనా వేయబడిందని కూడా మెయిలు పత్రిక ప్రకటించింది.

రామస్వామి రెడ్డియారు గారు అమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. సాంబారుకు రేషనింగు పెట్టడం కేవలం "తుఘ్లక్ చర్య" అని, ఈ నిర్ణయాన్ని మార్చుకోకపోతే, తాము సత్యాగ్రహోద్యమాన్ని లేవదీస్తామని ప్రభుత్వానికి సవాలు చేశారు.

చాలామంది నాయకులు ప్రభుత్వాన్ని పత్రికలలో ఏకేశారు. కనీసం చాలినంత సాంబారైనా ప్రజలకియ్యజాలని ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అనిపించుకోజాలదని, ఇప్పుడు జరిగిన విపత్తుకేమి, సంభవించిన చావులకేమి ప్రభుత్వం బాధ్యత వహించవలసి వుంటుందని, ఒక నాయకుడు అన్నాడు.

"కనీసం రోజుకు శేరు సాంబారైనా కావాలి. అటువంటప్పుడు, తలకు 3 గరిటలు సాంబారు మాత్రమే ఇయ్యడం అన్యాయం, అక్రమం, అధర్మం. ఈచర్యను తమిళజాతి సహించబోదు", అని ఇంకొక నాయకుడు గర్జించాడు.

శ్రీ అనంతశయనం అయ్యంగారు ఒక ప్రకటన చేస్తూ, సాంబారు రేషను వార్తవలన ఒక తమిళులకే ప్రమాదం సంభవించిందని అనుకోకూడదని, వందలాది ఆంధ్రులకు ఈవార్త వినడంవలన చలిజ్వరం మొదలైన తాత్కాలిక జబ్బులు పట్టుకున్నాయని, అన్నారు. సాంబారు ఆంధ్ర తమిళ సామరస్య సాధన కుపకరిస్తోందని, విదేశాల నుంచి ముడి పదార్థాలను దిగుమతి చేసైనా సరే, సాంబారుపై కంట్రోలు వెంటనే ఎత్తివేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శ్రీ కామరాజునాడారు ఎసెంబ్లీలో ఎడ్జర్న్ మెంటు ప్రతిపాదనకు నోటీసు ఇచ్చారు. సాంబారు రేషనింగు ప్రకటనవల్ల (ఇటీవలనే) ఏర్పడిన అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిని చర్చించుటకు సభాకార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరబడింది. స్పీకరు దీనిని "అవుటాఫ్ ఆర్డరు" అని కొట్టెయ్యలేదు.

సాంబారురేషనింగువల్ల మంత్రులందరూ ప్రజల్ని చంపేశారని, చాలామంది స్పృహతప్పి ప్రమాదపరిస్థితిలో వున్నారని, దీనికంతకీ మంత్రులు బాధ్యులని, మంత్రులపై ఒక అభియోగాన్ని మోపి, దీని విచారణకై 5 గురు ఎసంబ్లీ సభ్యులతో గూడిన ఒక కమిటీని వేయాలని కోరుతూ, ఒక మాజీప్రధాని ఒక ప్రతిపాదనకు నోటీసిచ్చాడని ఎసెంబ్లీలో స్పీకరు ప్రకటించారు. ప్రతిపాదనను తాము ఆమోదించినట్లుకూడా స్పీకర్ ప్రకటించాడు.

ఎసెంబ్లీ బయట 10, 000 మంది తమిళ యువకులు "మంత్రులు కనిపిస్తే పచ్చడి చేస్తామంటూ" ఆందోళన చేస్తున్నారు. "సాంబారు రేషనింగు" అని ఒకడు ఎలుగెత్తి అరిచాడు. అమట్టున తమిమ్మా తొమ్మిదివేల తొమ్మిదివందల తొంభైతొమ్మిదిమంది "తీసెయ్యాలి" అని ఏక కంఠంతో అసెంబ్లీ, కోట అదిరిపోయేటట్లు అరిచారు. పోలీసులు వెళ్లిపొమ్మని వారించినా వారు వెళ్లలేదు. దేహశుద్ధి చేస్తామని బెదిరించినా వాళ్లు ఖాతరచెయ్యలేదు. ముఖ్యమంత్రి కనిపిస్తేనే గాని, చావనైనా చస్తాంగాని కదలం అన్నారు.

మంత్రివర్గసమావేశంజరిపే ఎసెంబ్లీ సమావేశాన్ని రాత్రికి అపివేశారని, సమావేశమైనపిదప దర్శనమిస్తామని ముఖ్య


SPLENDID SELECTION
MADE IN FAMOUS SWISS FACTORIES
EACH GTD. FIVE YEARS

NO-81

Size 7¼"
5 JEWELS CHROME 30/- ROLLED GOLD 33/-
7 JEWELS CHROME 35/- SUPERIOR 38/-
15 JEWELS " 44/- ROLLED GOLD 48/-

NO-82

Size 7¼"
5 JEWELS CHROME 28/- ROLLED GOLD 33/-
7 JEWELS CHRME 33/- SUPERIOR 35/-
15 JEWELS " 42/- ROLLED GOLD 45/-

NO-83

Size 12"
FULLY JEWELLED 19/- SUPERIOR 21/-
WITH RADIUM 21/- CENTRE SECOND 23/-
SPECIAL HIGH CLASS MACHINE 27/-

NO 84

Size 8¾"
5 JEWELS CHROME 26/- ROLLED GOLD 32/-
7 JEWELS CHROME 32/- ROLLED GOLD 36/-
15 JEWELS " 48/- ROLLED GOLD 58/-

NO-85

Size 6¼"
5 JEWELS CHROME 22/- SUPERIOR 25/-
5 " ROLLED GOLD 30/- SUPIRIOR 33/-
15 " CHROME - 45/- ROLLED GOLD 55/-
TIME PIECE - 20/- SUPERIOR 25/-
POCKET WATCH 12/- SUPERIOR 15/-
Postage extra. Free on order for two

H. DAVID & CO.
POST BOX NO 11424 CALCUTTA

మంత్రి చెప్పమన్నారని ఆయన కార్యదర్శి వచ్చి చెప్పటంతోనే, బహుశా రేషను ఎత్తేసే వుద్దేశ్యంతోనే అత్యవసర మంత్రివర్గసమావేశం జరుగుతోందని ప్రజలు ఆశించడం మొదలెట్టారు.

కొద్దిసేపట్లో ముఖ్యమంత్రి వచ్చారు. ఆయన వచ్చీ రావడంతోనే, "సాంబారు రేషనింగ్ ఎత్తివేస్తారా లేదా" అని ఒక యువకుడు ముందుకు వచ్చి ప్రశ్నించాడు.

సావధానంగా తాము చెప్పింది వినవలసిందని అట్టుడికి పోతున్న ప్రజలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తిచేసి, సాంబారుకు రేషన్ పెట్టకూడదని మంత్రివర్గం నేటి సమావేశంలో నిశ్చయించిందని వెల్లడించేసరికి, చప్పట్లు, కేకలు, జై జైలు మిన్నుముట్టాయి. మరి 10 నిమిషాలవరకు ముఖ్యమంత్రిని మాట్లాడ నియ్యలేదు.

ఈ చర్యవలన ఇంత క్లిష్టపరిస్థితి ఏర్పడుతుందని తాము భావించలేదని, జనాన్ని దానికి తమ విచారాన్ని తెలుపుతురిగినమనీ ఆయన అన్నారు. జిల్లాలనుంచి తమకు వచ్చిన రిపోర్టులవల్ల, ఈవార్తవల్ల చావులేమీ సంభవించలేదని తాము చెప్పగలిగినందుకు సంతోషిస్తున్నా మన్నారు.

తమ ప్రభుత్వం ప్రజాప్రభుత్వం అని, ప్రజలకిబ్బంది కలిగించే పని తాము ఎన్నడూ చేయమని ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. ఇతర దేశాలనుంచి సాంబారుకు కావలసిన ముడిపదార్థాలను దిగుమతి చేసి సాంబారు కొరతను తీర్చడానికి ప్రభుత్వం నిశ్చయించింది కనుక ప్రజ లీవిషయమై గాభరాపడ నవసరంలేదని కూడా ఆయన హెచ్చరించారు.

మన ఆంధ్రులుకూడా, తమిళులీనాడు చూపించిన ఐక్యతా, పౌరుషం కార్యాచరణలో చూపిస్తే ఈపాటికి ఆంధ్రరాష్ట్రం రాకపోయిందా అనుకుని, ఈ వార్త యివ్వడానికి ఆఫీసుకు పరిగెత్తాను.

మా సంపాదకులు ఏదో వ్రాసుకుంటున్నారు. ఆయన వులిక్కిపడేలాగ, "ఫ్లాష్, ఫ్లాష్" అనిగట్టిగా సంతోషంగా అన్నాను.

ఇంతలో చేతిమీద చుర్రుమంది, కళ్లు విప్పి చూస్తే, మా ఆవిడ కాఫీ గ్లాసుతో ప్రత్యక్షమయింది. ★



న్యూఢిల్లీ పార్లమెంటు భవనంలో, సభ్యులకోసమై ఏర్పాటుచేయబడిన హైదరాబాదులోని తెలంగాణా ప్రాంతంలో దౌర్జన్యకారకులనుండి లాగుకొన్న ఆయుధాలూ, మందుగుండుసామాగ్రి, తదితర ఉపకరణాల నమూనాల ప్రదర్శనాన్ని ప్రధాని నెహ్రూ, రైల్వే రవాణాలమంత్రి గోపాలస్వామి అయ్యంగారు, భారత సర్వసేనాని జనరల్ కరియప్ప గార్లు తిలకిస్తున్నారు.